## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**అచ్చంపేట రూరల్/మన్ననూరు:** పట్టణంలోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో మెయింటనెన్స్ కారణంగా గురువారం మధ్యాహ్నం 1:00 నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జ్ ఏడీఈ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అచ్చంపేట, ఉప్పునుంతల, అమ్రాబాద్, పదర మండలాల్లో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఆయా మండలాల విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

### బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

**చారకొండ:** మండలంలోని జూపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కడారి వీరయ్య, అంకిల్ల మైసమ్మ కుటుంబాలను బుధవారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పరామర్శించారు. వీరయ్య కుటుంబానికి రూ. 5 వేలు, మైసమ్మ కుటుంబానికి రూ. 3 వేలు ఆర్థిక సాయం అందించారు.

**తోటి కార్మికుకుడికి..**

**ఉప్పునుంతల:** మండల కేంద్రానికి చెందిన శ్రీరామ తాపీ కార్మిక సంఘం సభ్యుడు ఆలూరి తిర్పతయ్య మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. కార్మిక సంఘం నాయకులు, సభ్యులు డబ్బులను పోగు చేసుకొని బాధిత కుటుంబానికి రూ.40 వేలు అందజేశారు. మున్య, పరశురాములు, రామస్వామిగౌడ్, మల్లేష్, రామచంద్రయ్య, వెంకటేష్, ఖాసీం తదితరులు ఉన్నారు.

### వృద్ధులకు పండ్లు పంపిణీ

**కల్వకుర్తి రూరల్:** పట్టణంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు బుధవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి నసీం సుల్తానా పండ్లు పంపిణీ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఆమె వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. వసతులను, యోగక్షేమాన్ని అడిగి తెలుసుకున్నారు. వెంకటయ్య, పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి సిమెంట్ వితరణ

**కల్వకుర్తి రూరల్:** మండలంలోని తర్నికల్‌లో పునర్నిర్మిస్తున్న పోచమ్మ దేవాలయానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ చేయూత అందించారు. ఆలయ కమిటీ సభ్యుల వినతి మేరకు బుధవారం 75 బస్తాల సిమెంటును వితరణ చేశారు. కార్యక్రమంలో సురేష్ గౌడ్, దేవయ్య, కృష్ణ, గుండాల రాము తదితరులు పాల్గొన్నారు.

### చెక్కు అందజేత

**చారకొండ:** మండలంలోని గోకారం గ్రామానికి చెందిన బాదగోని మల్లమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.52 వేలు మంజూరయ్యాయి. బుధవారం లబ్ధిదారురాలుకి మాజీ ఎంపీటీసీ కొండల్, స్థానిక నాయకులు జగత్‌రెడ్డి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాగేష్, కిరణ్, కాసిం, వెంకటయ్య, రామస్వామి ఉన్నారు.

### విధుల్లో నిర్లక్ష్యం సరికాదు

**పెద్దకొత్తపల్లి:** విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ గోపినాథ్, రాజులు హెచ్చరించారు. ఏటీఎం కార్డులు, ఇతర లెటర్లు ఎవరికి ఇవ్వడం లేదని సాతాపూర్ పోస్ట్‌మాస్టర్‌పై ఇటీవల గ్రామస్తులు వనపర్తి పోస్టల్ సూపరిండెంట్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు సాతాపూర్ పోస్ట్‌ఫీస్‌ను సందర్శించి తనిఖీ చేశారు. 49 ఏటీఎం కార్డులు, 251 ఉత్తరాలు, 300 వరకు రిజిష్టర్ పోస్టులు, ఇతర వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### చికిత్స పొందుతూ యువకుడి మృతి

**లింగాల:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన పూజారి సూర్యప్రకాష్ (32) హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడు తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వెంకటేశ్వర్‌గౌడ్ మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంపై ధారారం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్న సమయంలో మినీ గురుకుల పాఠశాల సమీపంలో ఉన్న మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడడంతో తలకు బలమైన గాయమైంది. బాధితుడిని వెంటనే నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. బైక్‌పై ఉన్న మరో వ్యక్తి కందుల గోపాల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి భార్య దీప ఉన్నారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### మొక్కలు సిద్ధం చేయండి

**తాడూరు:** మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉన్న నర్సరీలలో ఉన్న మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలని ఎంపీడీఓ ఆంజనేయులు కోరారు. బుధవారం మండలంలోని ఇంద్రకల్ నర్సరీలను ఆకస్మికంగా సందర్శించారు. నిర్వాహకులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. మండలంలో లక్ష 40 వేల మొక్కలను నాటేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఏపీఓ చంద్రసిద్ధార్థ, క్షేత్ర సహాయకుడు, సిబ్బంది ఉన్నారు.

# ‘మధ్యాహ్న’ బిల్లులకు అవస్థలు

- వంట ఏజెన్సీలకు తప్పని వెతలు
- మధ్యాహ్న భోజనం తయారీకి ఇబ్బందులు



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు



మోడల్‌స్కూల్‌లో వంట చేస్తున్న కార్మికులు

**వెల్దండ:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజన ఏజెన్సీలకు బిల్లులు అందక అవస్థలు పడుతున్నారు. భోజనం చేసేందుకు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. ప్రతి నెల బిల్లులు అందిక వంట నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుంది. కాని క్షేత్ర స్థాయిలో వంట నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు కూరగాయలు, గుడ్లు, పప్పులు, నూనె తదితర సామాగ్రి కొనుగోలు కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మండలంలో 57 పాఠశాలల్లో..**

మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు మొత్తం 57 ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 45, ప్రాథమికోన్నత పాఠశాలలు 5, ఉన్నత పాఠశాలలు 7 ఉన్నాయి. ఇందులో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 851, 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు 443, 9వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 363 మంది విద్యార్థులు చదువుతున్నారు. మండలంలోని ఆయా పాఠశాలల్లో 1657మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతి నెల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడానికి 73 మంది వంట కార్మికుల పనిచేస్తున్నారు. ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా బియ్యం అందిస్తున్నారు. కాని కూరగాయలు, నూనెలు, పప్పులు, గుడ్లు తదితర వాటిని వంట నిర్వాహకులు కొనుగోలు చేసి వంట చేస్తున్నారు. మండలంలోని వంట నిర్వాహకులు దాదాపుగా ప్రతి నెల కూరగాయాల కొనుగోలు కోసం రూ.2.45 లక్షలు పైగా, అదనంగా గుడ్లకు రూ.80వేలు ఖర్చు చేస్తున్నారు.

**పెండింగ్‌లో రూ.4.65 లక్షలు**

గత విద్యా సంవత్సరంలో రెండు నెలలు, ఈ ఏడాదిలో గౌరవ వేతనాలు, గుడ్ల ఖర్చు, వంట సామాగ్రి బిల్లులు దాదాపుగా రూ.4.65లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు నిర్వాహకులు, అధికారులు వివరించారు. ఉన్నత అధికారులు స్పందించి ప్రతి నెల బిల్లులు అందించాలని కోరుతున్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్నబిల్లులు చెల్లించాలని కోరుతున్నారు.

#### అప్పులు చేసి సరుకులు కొనుగోలు



మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్ విద్యార్థులకు భోజనం చేయాలంటే తప్పనిసరి అప్పులు చేయవల్సిందే. విద్యార్థులకు సంఖ్య ఎక్కువగా ఉండడంతో తప్పనిసరి పరిస్థితిలో కిరాణ షాపుల వద్ద ప్రతి రోజు సామాగ్రి తీసుకొని అప్పుగా రాయించుకుంటున్నాం. ప్రతి నెల పాఠశాలల్లో రూ.40 వేల నుంచి రూ.50వేల బిల్లు అవుతోంది. ప్రతి నెల బిల్లులు వస్తే ఇబ్బందులు ఉండవు.

–లక్ష్మమ్మ, వంట నిర్వాహకురాలు, వెల్దండ

#### వేతనాలు అందడం లేదు



వంట ఏజెన్సీలకు ప్రభుత్వం ప్రతి నెల అందస్తున్న వేతనాలు సకాలంలో రావడం లేదు. మూడు నెలలుగా వేతనాలు రావడం లేదు. 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఒకసారి బిల్లులు వస్తాయి. 9 నుంచి 10వ తరగతికి మరోసారి బిల్లులు రావడంతో ఇబ్బందిగా ఉంది. బిల్లులు ఒకేసారి వచ్చేవిధంగా చూడాలి.బిల్లులు అందక, వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నాం.

–దేవకమ్మ, వంట నిర్వాహకురాలు, వెల్దండ

#### పెండింగ్‌లో ఉన్నది వాస్తవమే..



మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల బిల్లులు కంప్యూటర్ ద్వారా జిల్లా అధికారులకు అందిస్తున్నాం. బడ్జెట్‌ను బట్టి బిల్లులు మంజూరు అవుతున్నాయి. కొన్ని నెలలు బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసిన వెంటనే నిర్వాహకుల బ్యాంక్‌ల ఖాతాలో జమ చేస్తాం. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు కృషి చేస్తా.

–చంద్రుడు, ఇన్‌చార్జ్ ఎంఈఓ, వెల్దండ

### సాగునీరు అందించాలి



**చారకొండ:** పంటలకు సాగునీరు అందించాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని జూపల్లి శివారులో కేఎల్ఐ లిఫ్టు ఇరిగేషన్ డి 82 కాల్వను నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. కాల్వ నిర్మాణాలపై ఆరా తీశారు. సమీప రైతులతో మాట్లాడారు. కాల్వల ద్వారా సాగునీరు ఆలస్యం అయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కాల్వ వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మట్లాడారు. గత ప్రభుత్వంలో కాల్వల ద్వారా సాగునీరు రైతులకు సాగు సమయానికి ముందే అందించామని గుర్తుచేశారు. కాల్వల ద్వారా సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని ఆరోపించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ విజయ్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్య గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు పెద్దయ్య యాదవ్, తిరుపతయ్య చారి, జగపతి, శ్రీరాములు, శేఖర్ గౌడ్, బిక్షపతి, వెంకటయ్యగౌడ్, రామస్వామి, గంగరాజు, రియాజ్, బిక్కన్ ప్రశాంత్ పార్టీ నాయకులు, రైతులు తదితరులు ఉన్నారు.

### అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు



**కల్వకుర్తి రూరల్:** అవసరమైన వారందరికీ కంటి ఆపరేషన్లు చేస్తామని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి పరీక్ష శిబిరం బుధవారం 5వ రోజుకు చేరుకుంది. శిబిరంలో 1000 మంది హాజరుకాగా 700 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 35 మందికి ఆపరేషన్ అవసరమని వైద్యులు గుర్తించారు. 350 మందికి కంటి అద్దాలు అందించారు. అనంతరం ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ కళ్లను అందరు జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. శిబిరంలో శస్త్ర చికిత్స చేయించుకున్న వృద్ధులతో, మహిళలతో ఆయన మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వైద్యులు అలెక్స్‌తో పాటు ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, నరేందర్ గౌడ్, యూసుఫ్ బాబా, గణేష్, శ్రీపతి, కల్యాణ్ పాల్గొన్నారు.

### ఇసుక రీచ్‌ల గుర్తింపు

**తిమ్మాజిపేట:** మండలంలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు, పలు అభివృద్ధి పనులకు ఇసుక అవసరం దృష్ట్యా అధికారులు ఇసుక రీచులను గుర్తించారు. ఈ సందర్భంగా ఆవంచ లో బుధవారం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ రామకృష్ణయ్య, ఎంపీడీఓ లక్ష్మీదేవి ఇసుక తరలింపుపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. దుందుబీ వాగులో ఇసుక రీచులను గుర్తించడం జరిగిందన్నారు. ఆర్ఐ రవిచంద్ర, ఏఎస్ఐ శ్రీనివాస్, మైనింగ్ ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శి, పలువురు గ్రాస్తులు పాల్గొన్నారు.

### స్ట్రీట్ వెండింగ్ జోన్లను గుర్తించాలి



**కల్వకుర్తి టౌన్:** పట్టణంలోని పలు ప్రధాన వీధులు, రహదారుల గుండా స్ట్రీట్ వెండింగ్ జోన్లను ఏర్పాటు చేసేలా ప్రణాళికలను రూపొందించాలని మెప్మా సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ మహామూద్ షేక్ సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో పలు శాఖల అధికారులతో 100 రోజుల ప్రణాళికపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వీధి వ్యాపారాల వివరాలను సర్వే చేయాలని సూచించారు. కల్వకుర్తి సీఐ నాగార్జున, సీహెచ్‌సీ సూపరిండెంట్ శివరాం, టీపీఓ వికాస్, ఆయా బ్యాంకుల మేనేజర్లు, మెప్మా, టీఎమ్‌సీ సిబ్బంది, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

### డ్రంకెన్‌డ్రైవ్‌లో జైలు శిక్ష

**నాగర్‌కర్నూల్ క్రైం:** మండలంలోని అంతారం గ్రామానికి చెందిన కొమ్ము బంగారయ్య డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డారు. ఈ మేరకు నిందితుడిని బుధవారం జిల్లా కేంద్రంలోని ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శృతి దూత ఎదుట హాజరుపర్చారు. నిందితుడికి 15 రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

**బిజినేపల్లి:** మండలానికి చెందిన సీర్ల మల్లయ్య డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడగా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శృతి దూత హాజరుపర్చగా రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

### వ్యక్తి మృతి.. కేసు నమోదు

**తెలకపల్లి:** ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనలో బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం బల్మూరు మండల కేంద్రానికి చెందిన గౌరమోని లింగస్వామి(46) మూడు రోజుల కిందట పీర్ల పండుగ కోసం రాకొండ గ్రామానికి వచ్చాడు. ఈ నెల 8న మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో అత్తగారి ఇంట్లో తాగి కూర్చున్న చోటే కింద పడ్డాడు. కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి సోదరుడు గౌరమోని రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ‘రెవెన్యూ’ దరఖాస్తుల పరిశీలన

**పెద్దకొత్తపల్లి:** భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులో 32 మంది చంద్రకల్ రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం తహసీల్దార్ శ్రీనివాసులు క్షేత్రస్థాయిలో పొలాల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూముల గట్ల పంచాయతీ, ప్రభుత్వ భూములు ఇతర వివాదాలకు చేసుకున్న దరఖాస్తులను రైతుల పొలాల వద్దనే పరిశీలించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శివకృష్ణ, సర్వేయర్ బాబునాయక్, రైతులు పాల్గొన్నారు.

### జెండా ఆవిష్కరణ

**కోడేరు:** మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ కార్యాలయం ఎదుట బీఎంఎస్ జెండాను రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. శశికుమార్, రమణారెడ్డి, ప్రకాష్‌గౌడ్, ప్రభాకర్, జితేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**లింగాల:** వంటశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రత్యేకాధికారి బషీర్ అహ్మద్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. మెనూ ప్రకారం భోజన అందిస్తున్నారా లేదా అని విద్యార్థునులకు అడిగి తెలుసుకున్నారు. భోజనంలో నాణ్యత పాటించాలని, తాజా కూరగాయలు, ఆకుకూరలు ఉపయోగించాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని ఆదేశించారు. విద్యార్థినిలకు తరచుగా వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. పలు అంశాలపై ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం మంగమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ప్రెస్‌క్లబ్ శిలాఫలకానికి పాలాభిషేకం

**కొల్లాపూర్:** పట్టణంలోనిప్రెస్‌క్లబ్ నిర్మాణం కోసం 2018 లో మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించిన శిలాఫలకానికి బుధవారం టీడబ్ల్యూజేఎఫ్ సంఘానికి చెందిన జర్నలిస్టులు పాలాభిషేకం చేశారు. జర్నలిస్టులు చేపట్టిన రీలే నిరాహార దీక్షలు 15వరోజు కొనసాగాయి. దీక్షల్లో కూర్చున్న జర్నలిస్టులు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వారు అక్రిడేషన్ కార్డులను ప్రదర్శించారు. జర్నలిస్టుల దీక్షలకు సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. దీక్షల్లో తాటికొండ కృష్ణ, రాంచందర్, ఎస్పీ మల్లికార్జున్, జలకం మద్దిలేటి, కురుమయ్య, రమణ తదితరులు ఉన్నారు.

### ధర్మ రక్షణ కోసం పాదయాత్ర

**కొల్లాపూర్ రూరల్:** ధర్మ రక్షణ, సనాతన ధర్మ సాధన కోసం లక్ష్మిపతి స్వామిజీ కర్ణాటక నుంచి పాదయాత్ర చేపట్టాడు. బుధవారం కొల్లాపూర్ పట్టణానికి పాదయాత్ర చేరుకుంది. సనాతన ధర్మ రక్షణ కోసం 2016 అక్టోబర్‌లో కర్నాటక రాష్ట్రం నుంచి పాదయాత్ర ప్రారంభించినట్లు స్వామిజీ తెలిపారు. ప్రతి రోజు 30 కిలో మీటర్లు నడుస్తానని ఆలయాల్లో బస చేస్తానని వివరించాడు. ఇప్పటికి 8 రాష్ట్రాలు తిరిగానని త్వరలో పాదయాత్రను కర్ణాటకలో ముగిస్తానని పేర్కొన్నారు.

## విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం

**కల్వకుర్తి రూరల్:** విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏబీవీపీ మాత్రమేనని ఆ సంఘం నగర కార్యదర్శి అక్కి వంశీ గౌడ్ అన్నారు. బుధవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలో భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆసంఘం జండాను ఆయన ఎగురవేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్, మోహన్, హరికృష్ణ తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

**ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు**

**వెల్దండ:** మండల కేంద్రంలో ఏబీవీపీ వెల్దండ శాఖ ఆధ్వర్యంలో ఏబీవీపీ 77వ ఆవిర్భవ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అంబేడ్కర్ విగ్రహం వద్ద జెండాను ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో నాయకులు తంబాలు, శ్రీకాంత్, హరీష్, శివ, చరణ్, నాగరాజు, శివ తదితరులు ఉన్నారు.



కల్వకుర్తిలో ఏబీవీపీ విద్యార్థుల ర్యాలీ

## ఘనంగా ఇందిరా మహిళా శక్తి సంబరాలు

**సాక్షి, నెట్‌వర్క్:** నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా బుధవారం ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. కల్వకుర్తి మండలం ముకురాల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద సంఘం సభ్యులు హాజరయ్యారు. ఇందిరా మహిళా శక్తి సంబరాలు జరుపుకున్నారు. వెల్దండలో గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ముగ్గులు వేసి రంగులతో అలంకరించారు. పెద్దకొత్తపల్లి మండల సమాఖ్య వద్ద ఏపీఎం అరుణ మహిళ సమాఖ్య జెండాను ఆవిష్కరించారు. ఉప్పునుంతల మండల పరిధిలోని గ్రామాల్లో గ్రామైక్య మహిళా సంఘం సమావేశాలు నిర్వహించారు. గ్రామంలోని మహిళా సంఘాలు బ్యాంకుల ద్వార తీసుకున్న రుణాలు, శ్రీనిధి రుణాలు, రికవరీ తదితర అంశాలపై చర్చించారు. అమ్రాబాద్ మండలం తుర్కపల్లిలో ఏపీఎం నిరంజన్ హాజరయ్యారు. చారకొండ మండలంలోని జూపల్లి, సిర్సనగండ్లలో ఏపీఎం రాములు పాల్గొన్నారు. రుణాలను సకాలంలో చెల్లించాలని తెలకపల్లి ఏపీఎం చంద్రయ్య కోరారు.



పెద్దకొత్తపల్లిలో సంబరాలు నిర్వహిస్తున్న మహిళా శక్తి సభ్యులు

### ఎన్నికల నిర్వహణలో బీఎల్‌ఓల పాత్ర కీలకం

**కల్వకుర్తి రూరల్:** క్షేత్రస్థాయిలో ఎన్నికల నిర్వహణ కీలకమని ఆర్డీఓ శ్రీను అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రెండోరోజు బుధవారం బీఎల్‌ఓలకు శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఎన్నికల బాధ్యత బీఎల్‌ఓలపై ఆధారపడి ఉందన్నారు. కల్వకుర్తి, వెల్దండ, చారకొండ మండలంలోని బీఎల్‌ఓలు శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణలో తహసీల్దార్లు ఇబ్రహీం, కార్తీక్, సునీత, ఎన్నికల డీటీ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

### నోట్ పుస్తకాలు పంపిణీ

**చారకొండ:** మండలంలోని రామచంద్రాపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగులు, పెన్సిళ్లు బుధవారం సీబీఎం ట్రస్టు చైర్‌పర్సన్ చిక్కుడు అనురాధ పంపిణీ చేశారు. అదేవిధంగా మండలంలోని శాంతిగూడెంకు చెందిన సంగేటి షేరయ్య, రామచంద్రాపురం కు చెందిన లక్ష్మమ్మ, బుచ్చులు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబసభ్యులను ఆమె పరామర్శించిరూ. 5 వేల చొప్పున అందించారు. బాల్‌రాం గౌడ్, మహేందర్, ప్రశాంత్ నాయక్, నాగేంద్ర, శివ తదితరులు ఉన్నారు.

### ముగ్గురు వ్యాపారులపై కేసు నమోదు

**లింగాల:** మండల కేంద్రంలో ఆపరేషన్ ముస్కాన్ బృందం-2 బుధవారం నిర్వహించిన తనిఖీలలో బాలకార్మికులను పనిలో పెట్టుకున్న వ్యాపారులను గుర్తించినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడు తెలిపారు. బృందం సభ్యులు ముద్దనూరు సృజన, ఎస్‌ఐ ఇందిరమ్మ, సిబ్బంది దుకాణాలను ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. కిరాణం షాపులు నిర్వహిస్తున్న గంధసిరి సాయిబాబు, బొమ్మ శ్రీకాంత్ అదే విధంగా బైక్ పాయింట్‌లో పని చేస్తున్న బాల కార్మికులను గుర్తించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. పనిలో పెట్టుకున్న వ్యాపారులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

### మహిళ ఆత్మహత్యపై డీఎస్పీ విచారణ

**వెల్దండ:** మండల కేంద్రంలో వివాహిత కొనేరు అశ్విని ఈనెల 8న ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేయడంతో బుధవారం కల్వకుర్తి డీఎస్పీ వెంకట్‌రెడ్డి, వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డిలు మహిళ ఆత్మహత్యపై ఇంటికి వెళ్లి భర్త వెంకటేష్‌తో కుటుంబాలను డీఎస్పీ విచారించారు. మృతిగల కారణాలను తెలుసుకున్నారు. ఈ నెల7వ తేదీన భర్త వెంకటేష్ భార్య అశ్విని గొడవపడినట్లు తెలిపారు. మంగళవారం పనికి వెళ్తున్న వెంకటేష్ భార్య టిఫిన్ బాక్స్ కట్టిన తీసుకోకుండా మాట్లాడకుండా వెళ్లిపోయాడు. మనస్థాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వెల్దండ ఎస్‌ఐ కురుమూర్తి, పోలీస్‌సిబ్బంది తదితరులు ఉన్నారు.

### ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ



**నాగర్‌కర్నూల్ రూరల్/మన్ననూరు:** మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఉయ్యాలవాడలో కొత్తగా నిర్మించనున్న సీసీ రోడ్డుకు, ఛత్రపతి శివాజి మహారాజ్ ఫౌండేషన్ స్టోన్‌కి శంకుస్థాపన చేశారు. మన్ననూరులో ఇందిరమ్మ ఇంటికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు మైనోద్దీన్ భూమి పూజ చేశారు. రమణారావు, కోటయ్య, మాజీ కౌన్సిలర్స్, కార్యకర్తలు పాల్గొన్నారు.

### తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

**వెల్దండ:** దారి తప్పిన బాలుడిని తల్లిదండ్రులకు బుధవారం పోలీసులు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెదురుపల్లి గ్రామానికి చెందిన నరేందర్ కుమారుడు రిత్విక్(3)సంవత్సరాల బాలుడు దాదాపుగా ఉదయం 9.30గంటల సమయంలో ఇంటి ముందు ఆడుకుంటు కనిపించకుండా పోయాడు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం అందించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కల్వకుర్తి డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో పోలీసులు వెతికారు. అనుమాన వ్యక్తులను విచారించారు. గ్రామానికి చెందిన అండాలు అనే మహిళ వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా సమీపంలో పిల్లల ఏడుపు వినిపించింది. బాలుడు వద్దకు వెళ్లి గ్రామంలోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దాదాపుగా మూడు గంటల పాటు శ్రమించిన పోలీసులు బాలుడిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులను ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అభినందించారు.

### సీఎంకు రుణపడి ఉంటాం

**నాగర్‌కర్నూల్ రూరల్:** రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్ చెందిన మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వడంపై సంతోషకరమని ముదిరాజ్ కులస్తులు సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటామని తెలంగాణ రాష్ట్ర ఫీషర్ మెన్ కోపరేటివ్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. బుధవారం మండలంలోని ఎండబెట్ల మత్స్య పారిశ్రామిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. అడ్వకేట్ గౌర్ల శ్రీను, మాజీ జిల్లా అధ్యక్షుడు తెప్ప తిరుపతయ్య, జిల్లా నాయకులు నిరంజన్ బాషమోని సైదులు, గోడుగు సహదేవుడు, వెన్నచర్ల రాముడు, బంగారయ్య, బాల్ చంద్రయ్య, యాదయ్య, నర్సింహ, ఆంజనేయులు, కరుణకర్, రాజేందర్, వెంకటస్వామి, జనార్దన్ పాల్గొన్నారు.

## కదంతొక్కిన కార్మికులు



కొల్లాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు



అచ్చంపేటలో సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ



తిమ్మాజిపేటలో నిరసన తెలుపుతున్న కార్మికులు

**నాగర్‌కర్నూల్ రూరల్:** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక ప్రజా రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కు నుంచి మహా ప్రదర్శన చేపట్టారు. అనంతరం సాయి గార్డెన్ లో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య అధ్యక్షతన సభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఆర్.శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయడానికి 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడులుగా మార్చడం సిగ్గుచేటన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం నర్సింహ, ఆనంద్‌జీ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, పొదిల రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

**బంద్ ప్రశాంతం**

**కోడేరు:** మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ్మా, నాయకులు రవి, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు. సీఐటీయూ, రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ విజయ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

**కొల్లాపూర్:** పట్టణంలో సీపీఎం, సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. ఎన్టీఆర్ చౌరస్తాలో మానవహారం ఏర్పాటుచేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే కార్మికులు విధులకు గైర్హాజరయ్యారు. పలు సంఘాలకు చెందిన ఆర్టీసీ కార్మికులు విధులను బహిష్కరించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్, సహాయ కార్యదర్శి శివవర్మ, పి.నర్సింహ, నాయకులు పాల్గొన్నారు.

**నాలుగు లేబర్‌కోడ్లను ఎత్తేయాలి**

**కల్వకుర్తి రూరల్:** నాలుగు లేబర్ కోడ్‌లను ఎత్తేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. కార్మికులు, ఉద్యోగులు విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు.

**అచ్చంపేటలో భారీ ర్యాలీ**

**అచ్చంపేట రూరల్:** ప్రధాని నరేంద్రమోడీ అవలంభిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై నిరసనగా సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీలు నిర్వహించారు. సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బహిరంగ సభను నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకుల నిరసన చేపట్టి ఆర్డీఓ మాధవికి వినతి పత్రం అందజేశారు. దేశ్యానాయక్, శంకర్‌నాయక్, మల్లేష్, రాములు, భారతి, మంజుల పాల్గొన్నారు.

**తిమ్మాజిపేటలో..**

**తిమ్మాజిపేట:** మండల కేంద్రంలోని మద్యం డిపోకు చెందిన ఐఎంఎఫ్‌ఎల్ కార్మికులు డిపో నుంచి అంబేడ్కర్ విగ్రహ వరకు ఎర్ర జెండాలు పట్టుకొని భారీ ర్యాలీ చేశారు. ప్రధాన రహదారిపై నిరసన చేపట్టారు. ర్యాలీకి మద్దతుగా బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ సర్పంచ్ గోపిగౌడ్, మాజీ డైరెక్టర్ వెంకటేష్ ర్యాలీలో పాల్గొన్నారు. ఆరోగ్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి ఆస్పత్రి ఎదుట నిరసన తెలిపారు.